క్లుప్తంగా

కార్పొరేట్ వైద్యం పొందేందుకు సీఎంఆర్ఎఫ్ దోహదం



ఎల్ఓసీ అందజేస్తున్న దేవి రవీందర్

కొండపాక(గజ్వేల్): పేదలు కార్పొరేట్ వైద్యం పొందేందుకు సీఎంఆర్ఎఫ్ దోహదపడుతుందని రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని మేదినీపూర్ గ్రామానికి చెందిన కోట శ్రీనివాస్ రూ.1,25,000లు, తుమ్మ మహేశ్‌కు రూ.లక్ష ఎల్ఓసీలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విరుపాక రమేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ర్యాంకులు సాధించాలి

దుబ్బాక: మైనార్టీ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర మైనార్టీ గురుకులాల సొసైటీ కార్యదర్శి షఫీఉల్లా సూచించారు. హైదరాబాద్‌లోని మైనార్టీ ఉన్నత కార్యాలయంలో దుబ్బాక మైనార్టీ పాఠశాల 2023 కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ఇంటర్మీడియట్‌లో అన్నీ సీట్లు భర్తీ అయ్యేలా ఉపాధ్యాయులు పాటుపడాలన్నారు. 10వ తరగతి ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరును తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో దుబ్బాక మైనార్టీ పాఠశాల ప్రిన్సిపాల్ విమలా రెడ్డి, తదితరులున్నారు.

మురుగునీటి సమస్య తీర్చండి



ట్యాంక్ సమీపంలో నిలిచిన మురుగు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కడవేర్గు గ్రామంలో మిషన్ భగీరథ ట్యాంక్ వద్ద మురుగు నీటి నిల్వలతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నిల్వ నీటిలో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మురుగు నీటిని తొలగించి నీటి నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు వేడుకుంటున్నారు.

పెరటి కోళ్లతో ఉపాధి



పెరటి కోళ్లను అందజేస్తున్న దృశ్యం

చిన్నకోదూరు(సిద్దిపేట): పెరటి కోళ్లను పెంచడం ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తాయని మండల పశువైద్యాధికారులు మంజుల, స్వాతి అన్నారు. శనివారం చిన్నకోదూరులో సబ్సిడీపై అందించే పెరటి కోడి పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెరటి కోళ్లను పెంచడం ద్వారా ఉపాధి పొందవచ్చన్నారు. అలాగే పాడి గేదెలను పెంచి పాల ఉత్పత్తి పెంచాలన్నారు. తద్వారా ఉపాధి పొందవచ్చన్నారు. వ్యవసాయంతో పాటు పాడి గేదెలు, పెరటి కోళ్ల పెంపకం వంటివి చేపట్టాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉమేశ్‌చంద్ర, చంద్రకళ రవి, ఎంపీటీసీ శారద రమేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ సర్వే చేసి జాబితాను సవరించండి

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో డబుల్ బెడ్రూం ఇళ్ల అర్హుల కోసం రీ సర్వే చేసి పేర్కొన్న జాబితాలో కూడా మళ్లీ అవే అవతవకలు జరిగాయని, మళ్లీ సర్వే చేసి జాబితాను సవరించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు. రెండో జాబితాలో అనర్హులను తొలగించి అర్హులను చేర్చాలన్నాడు. ఎటువంటి ఇల్లు, ఇంటి స్థలం, వ్యవసాయ భూమి, ఆస్తిపాస్తులు లేని నిరుపేదలకు ఇల్లు కేటాయించాలన్నాడు. కొన్ని వార్డుల్లో ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించారన్నారు.

జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 13న జిల్లా కేంద్రంలోని మంత్రి హరీశ్‌రావు క్యాంప్ కార్యాలయంలో నిర్వహించనున్న జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని ఉద్యోగ, ఉపాధ్యాయుల మహిళా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు లక్కిరెడ్డి విజయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 5.30గంటలకు కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

రాజీమార్గం.. సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న జడ్జి శివరంజని

హుస్నాబాద్: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా 701 కేసులు పరిష్కారమైనట్లు జడ్జి శివరంజని తెలిపారు. ఈ సందర్భంగా జడ్జి శివరంజని మాట్లాడుతూ.. క్షణికావేశంలో చోటుచేసుకున్న చిన్న చిన్న సమస్యలను కక్షిదారులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. మద్యం ఒక వ్యసనంగా మారిందని, యువకులు ఎక్కువగా మద్యం మత్తుతో వాహనాలు డ్రైవింగ్ చేయడంతో ఎదుటివారు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. మద్యానికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. చిన్నచిన్నసమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, కోర్టు చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్, ఏపీపీ నాగరాజు, రవికుమార్, ఏజీపీ కన్నోజు రామకృష్ణ, లోక్‌అదాలత్ మెంబర్ చిత్తారి రవీందర్, అడ్వకేట్లు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: రాజీపడదగిన కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కని వేదికని గజ్వేల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సౌమ్య, ప్రిన్సిపల్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంకలు పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా గజ్వేల్‌లోని కోర్టులో శనివారం రాజీపడదగిన క్రిమినల్, బ్యాంకు తదితర మొత్తం 194కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలతో కక్షలు పెంచుకోవద్దన్నారు. ఒకరిపై మరొకరు కేసులు పెట్టుకోవడం వల్ల విలువైన కాలంతో పాటు డబ్బు సైతం వృథా అవుతుందన్నారు. రాజీ పడదగిన కేసులను పరిష్కరించేందుకునేందుకు లోక్ అదాలత్ ఎంతో ప్రయోజనకరమన్నారు. లోక్ అదాలత్‌లో వెలువరించిన తీర్పు తుది తీర్పు అన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్, అసిస్టెంట్ పీపీ విజయసుధ, ఏపీజీ అశోక్‌రెడ్డి, న్యాయవాదులు, వివిధ బ్యాంకు మేనేజర్లు, మండల లీగల్ సర్వీస్ సిబ్బంది నర్సింహచారి, కోర్టు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సద్గుణ

కొండపాక(గజ్వేల్): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని బొబ్బాయిపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టే సీసీరోడ్డు పనులను సర్పంచ్ కోల శ్రీనివాస్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోల సద్గుణ మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రమయంగా ఉండేలా చూసుకోవాలన్నారు. సీసీరోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలు చేపట్టిందన్నారు. పనులు పారదర్శకంగా జరిగేలా కాంట్రాక్టర్ చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు సత్తమ్మ, నాయకులు కోల శ్రీనివాస్, రెడ్డమైన రమేశ్, శివరాత్రి బాబు, కృష్ణ, తూం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

షర్మిల పాదయాత్రకు సంఘీభావం



సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న నాయకులు

నంగునూరు(సిద్దిపేట): వైఎస్ షర్మిల చేపట్టిన పాదయాత్రకు సంఘీభావం తెలిపేందుకు శనివారం నంగునూరు, సిద్దిపేట మండలాల నుంచి పలువురు నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సత్తిరెడ్డి, చిన్నకోడూర్, మండల కన్వీనర్లు ఇమ్రాన్, నరసింహారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు షర్మిల చేపట్టిన యాత్రకు అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో కడారి సత్తిరెడ్డి, పాలెపు కనకయ్య, సదానందం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భూ పంపిణీలో తప్పుడు లెక్కలు సరికాదు



మాట్లాడుతున్న సత్యనారాయణ

బెజ్జంకి(సిద్దిపేట): నియోజకవర్గంలోని దళితులకు 1200 ఎకరాలు భూ పంపిణీ చేసినట్లు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రకటించి తప్పుడు లెక్కలతో మభ్యపెడుతున్నారని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మానకొండూర్ ఇన్‌చార్జి డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ ఆరోపించారు. మండలంలోని రేగులపల్లె, మల్లంచెరువు గ్రామాల్లో శనివారం గడప గడపకూ ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బెజ్జంకిలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. భూ పంపిణీ కేవలం 200 ఎకరాలు చేసి 1200 ఎకరాలుగా పేర్కొనడం సరైంది కాదన్నారు. లేదా వారు ఆక్రమించుకున్న భూములు కావొచ్చని ఎద్దేవా చేశారు. రోడ్లు మంజూరైనట్లు ప్రొసీడింగ్‌లు చూపిస్తూ మభ్యపెడుతున్నారని నెలరోజుల క్రితం మంజూరైన గన్నెరువరం రోడ్డు పనులేవన్నారు. దళితుల సంక్షేమానికి పాటుపడుతున్నట్లు పేర్కొనడం కాదు వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, సంపత్, శ్రావణ్, నాగరాజు, డీవీ రావు, మానాల రవి, నాగరాజు, ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేను విమర్శించడం తగదు'

బెజ్జంకి(సిద్దిపేట): అహర్నిశలు గ్రామాల్లో పర్యటిస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను విమర్శించడం బీఎస్పీ నాయకులకు తగదని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు బిగుల్ల మోహన్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. గ్రామాల్లో సీసీరోడ్లు, కమ్యూనిటీ భవనాలు, మినీ ఫంక్షన్ హాల్‌లు తదితర అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ఇవే కాకుండా రాష్ట్రం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు.

దళితుల అభ్యున్నతికి కృషి



పూజ చేస్తున్న ఎంపీపీ సాయిలు, తదితరులు

మిరుదొడ్డి(దుబ్బాక): దళితుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎంపీపీ గజ్జెల సాయిలు అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి శనివారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకున్నప్పుడే అర్హులైన ప్రతి ఒక్కరూ వృద్ధిలోకి వస్తారన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, వైస్ చైర్మన్ మల్లేశం, ఎంపీటీసీ సుతారి నర్సింహులు, సర్పంచ్ రంగనబోయిన రాములు, మాజీ ఏఎంసీ చైర్మన్ బాపురెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సూకూరి లింగం, నాయకులు అంజిరెడ్డి, మల్లయ్య, చంద్రం, రాజేశ్, నితిన్, బాబు, ప్రశాంత్, మహేందర్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్సీ కాలనీలో మురికి కాల్వల నిర్మాణానికి ప్రజాప్రతినిధులతో కలిసి భూమిపూజ చేశారు.

పోచమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటలో పోచమ్మ ఆలయ అభివృద్ధి కోసం అదే గ్రామానికి చెందిన మామిడాల సత్యనారాయణ రూ.50వేల విరాళాన్ని శనివారం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను అభినందించారు.

అసంపూర్తి పనులకు నిధులు మంజూరు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దుబ్బాక: అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని రాయపోల్ మండల బీఆర్ఎస్ నాయకులు రజనీకాంత్‌రెడ్డి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని కోరారు. శనివారం ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసి మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను వివరించారు. అనంతరం రజనీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న కుమ్మరి సంఘం భవనానికి నిధులు కేటాయించాలని కోరగా స్పందించిన ఎంపీ వెంటనే రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. అలాగే గ్రామంలో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని ఎంపీ హామీనిచ్చారన్నారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, తదితరులున్నారు.

ఆపదలో అండగా..



ఆర్థికసాయం అందజేస్తున్న మోహన్‌రెడ్డి

దుబ్బాక: దౌల్తాబాద్ మండలం గోడుగుపల్లి గ్రామానికి చెందిన శంకరయ్య, కిష్టయ్య, పలువురు ఇటీవల మృతి చెందడంతో శనివారం బాధిత కుటుంబాలను ప్రజాహిత ఫౌండేషన్ వ్యవస్థాకుడు, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు మామిడి మోహన్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అలాగే గ్రామంలోని నల్ల హేమలత సిద్ధిరాములు కూతురు భవాని వివాహానికి పుస్తె, మెట్టెలను అందజేశారు. కార్యక్రమంలో రాయపోల్ జెడ్పీటీసీ యాదగిరి, నాయకులు రాజేందర్, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



తూప్రాన్‌లో వాలీబాల్ క్రీడాకారులతో మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్

తూప్రాన్: సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని బీఆర్ఎస్ యూత్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను శనివారం మున్సిపల్ చైర్మన్ బొంది రవీందర్‌గౌడ్ ప్రారంభించారు. క్రీడలతో మానసికంగా ఉల్లాసం కల్గుతుందన్నారు. యువత చదువులతో పాటు క్రీడాల్లో రాణించాలని ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా క్రీడలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్స్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, కౌన్సిలర్ మామిడి వెంకటేష్, సత్య లింగం, తలారి మల్లేశ్, బొంది వెంకట్‌గౌడ్, ఏర్పుల లక్ష్మణ్, సర్గల శ్రీనివాస్, బండెల నరేశ్, ఆర్గనైజర్స్ శ్రీకాంత్, నానీ వెంకట్, యువకులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): డా.బీఆర్ అంబేడ్కర్ భావజాలంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌ను దేశ ద్రోహిగా పరిగణిస్తూ కఠినంగా శిక్షించాలని మాల మహానాడు మండల అధ్యక్షుడు ధార స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్‌పై చులకనగా మాట్లాడి దళితులు మనోభావాలను దెబ్బతీశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షంచకుంటే వందలాది ప్రసాద్‌లు పుట్టుకొచ్చి రాజ్యాంగానికే గొడ్డలి పెట్టులా మారతారన్నారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌ను శిక్షించకుంటే ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు నితిన్, ధార మల్లయ్య, రాములు, మద్దెల చంద్రం, మద్దెల లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆ వక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

తూప్రాన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, బైండ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశామని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. ప్రపంచ మేధావిని ఒక కులానికి అంకితం చేసి మాట్లాడడం సిగ్గు మాలిన చర్యగా ఖండించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, హమార ప్రసాద్‌పై అట్రాసిటీ కేసు, దేశద్రోహిగా గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, బైండ్ల సంక్షేమ సంఘం నాయకులు యాదగిరి మాదిగ, , సర్గల పరశురాములు మాదిగ, నర్సింలు, రమేశ్, కొండయ్య, జానీ, మహేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతంలో శక్తి కేంద్రాలు కీలకం



మాట్లాడుతున్న ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశంయాదవ్

కోహెడరూరల్(హుస్నాబాద్): బీజేపీ క్షేత్రస్థాయి బలోపేతంలో శక్తి కేంద్రాల పాత్ర కీలకమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గొర్ల కాపరుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉడత మల్లేశం యాదవ్ తెలిపారు. శనివారం మండలంలోని వరికోల్, రాంచంద్రాపూర్, వింజపల్లి ఎర్రగుంటపల్లి గ్రామాల్లో బీజేపీ శక్తి కేంద్రంలో భాగంగా ప్రజాగోస–ప్రజాభరోసా సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ 9 ఏళ్లుగా నిరంకుశ కుటుంబ పాలనను అంతమొందించేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. ప్రభుత్వ విధి విధానాలను ఎండగట్టేందుకు బూత్ కమిటీ సభ్యులే కీలకంగా వ్యవహరించాలన్నారు. జాతీయ, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఈనెల 10 నుంచి 25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 11 వేల శక్తి కేంద్రాల ద్వారా సభలు జరగనున్నాయన్నారు.అలాగే రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు శ్రీరాంచక్రవర్తి, సురేందర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, సర్పంచ్ మ్యాకల చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సురేందర్ తదితరులు ఉన్నారు.

స్ట్రీట్ కార్నర్ సమావేశాలను విజయవంతం చేయాలి

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్రంలో కేసీఆర్ చేస్తున్న అవినీతి పాలనను ప్రజలకు వివరించి బీజేపీని బలోపేతం చేసేందుకే స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేశ్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని దానంపల్లి, కమలాయపల్లి శక్తి కేంద్రం ఇన్‌చార్జి బర్మా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గ్రామాలన్నింటికి 14, 15 ఫైనాన్స్ కింద కేంద్రం ఇచ్చిన నిధులతోనే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి నియోజకవర్గానికి చేసిందేమి లేదన్నారు. కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి సమావేశాలను విజయవంతం చేయాలని ఆయన సూచించారు. కేసీఆర్ ఎలా ప్రజలను మోసం చేస్తున్నాడో వివరించి బీజేపీని బలోపేతం చేసే దిశగా కృషి చేస్తున్నామన్నారు. పాండు, మహేందర్‌రెడ్డి, యాదగిరి, లక్ష్మారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, కృష్ణారెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో మహిళలకు పెద్దపీట



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా మహిళా నేతలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం 2023–24 సంవత్సరానికి గాను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహిళల సంక్షేమం కోసం ప్రాధాన్యతనిస్తూ, మహిళలకు పెద్దపీట వేసినందుకు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని బీఆర్ఎస్ మహిళా నేతలు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బీఆర్ఎస్ జిల్లా మహిళా నాయకురాలు బూర విజయ, రామోజీల నిర్మల ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం మహిళలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ మహిళా సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు ఆ దేవుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నేతలు సువర్ణలక్ష్మి, అనితారెడ్డి, అర్చనరెడ్డి, తార తదితర మహిళా నాయకులు పాల్గొన్నారు.

మెపా రాష్ట్ర కార్యదర్శిగా రాజు



రాజు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ యూనియన్ సెక్రటరీగా జిల్లాకు చెందిన రాజబోయిన రాజును నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు శ్రీనివాస్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్‌లు శనివారం తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికలో తనకు సహకరించిన జిల్లా అధ్యక్షులు పిట్ల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి నాయినీ కృష్ణలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ముదిరాజ్‌ల అభివృద్ధికి మెపా రాష్ట్ర కార్యవర్గంతో కలిసి కృషి చేస్తామన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి జన్మదిన వేడుకలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మండల కేంద్రంలో శనివారం జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. జనగామ నియోజికవర్గ కో–ఆర్డినేటర్ గుజ్జు సంపత్‌రెడ్డి కేక్ కట్ చేయగా కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పని చేస్తున్న సఫాయి కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, జెడ్పీటీసీ సిద్దప్ప, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బత్తిని నర్సింహులు, బీఆర్ఎస్ నాయకులు తలారి కిషన్, ముత్యం నర్సింలు, ఏర్పుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈ నెల 20న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అరవింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యలపై అనునిత్యం ఉద్యమిస్తూ ముందుకు వెళ్తుందన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 20న మండల, జిల్లాస్థాయిలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షల్లో జిల్లా వ్యాప్తంగా టాప్ టెన్ నిలిచిన వారికి, అలాగే మండలానికి ముగ్గురికి బహుమతులు ఇస్తామన్నారు. ప్రముఖులతో నూతన సిలబస్ ఆధారంగా రూపొందించిన ప్రశ్నాపత్రం 100 మార్కులతో అన్ని సబ్జెక్టులలో మల్టిపుల్ ఛాయిస్, ప్రశ్నాపత్రం తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఉంటుందన్నారు. విద్యార్థులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఎస్ఎఫ్ఐ కార్యకర్తల(9533687400)ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నవీన్, నాయకులు రాఘవ, విజయ్ తేజ, వంశీ, భరత్, నరేశ్ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు ప్రారంభం



చందాపూర్ రోడ్డును వెడల్పు చేస్తున్న దృశ్యం

తొగుట(దుబ్బాక): మండలంలోని చందాపూర్ రోడ్డు మరమ్మతులు ప్రారంభమయ్యాయి. భారీ వాహనాలు తిరగడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఈ మార్గంలో ఆరునెలలుగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రవాణా సౌకర్యం లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రజాసమస్యను మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిల దృష్టికి మండల ప్రజాప్రతినిధులు తీసుకెళ్లారు. దీంతో వారు స్పందించి రూ.2.88కోట్లు మంజూరుకు కృషి చేశారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో టెండర్ ప్రక్రియ నిర్వహించిన రోడ్లు, భవనాల శాఖ అధికారులు పనులు ప్రారంభించారు. ఈ నిధులతో 7 మీటర్ల వెడల్పు, నాలుగు కల్వర్టులతో 2.6 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మించనున్నట్లు ఏఈ సాజిద్ తెలిపారు. రోడ్డు పూర్తయితే గజ్వేల్, తొగుట, మిరుదొడ్డి మండలాల ప్రజలకు సౌకర్యం ఏర్పడుతుంది. మరమ్మతులు ప్రారంభించడం సంతోషకరమని చందాపూర్ సర్పంచ్ నర్సింలు సంతోషం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేసిన మంత్రి హరీశ్‌రావు, ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవం



రథోత్సవంలో భక్తులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని బీ.కొండాపూర్ సింగరాయగుట్ట లక్ష్మీనర్సింహస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఉత్సవ విగ్రహాలను పూలతో అలంకరించిన రథంలో ఊరేగించారు. ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు చేగుంటతో పాటు భూంపల్లి, మిరుదొడ్డి మండలాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు రాజిరెడ్డి, సర్పంచ్ బాలనర్సు, ఉపసర్పంచ్ రమేశ్, ఎంపీటీసీ గూటం నవీన్‌తో గ్రామస్తులు ఉన్నారు.